
సాక్షి ఒడిశా

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,83,629
బంగారం	3 గ్రాముల 250 మిల్లీ గ్రాములు
వెండి	6 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



తుఫాన్ దృష్ట్యా పలు రైళ్లు రద్దు

మైచౌంగ్ తుఫాన్ దృష్ట్యా తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధి నుంచి బయల్దేరుతున్న పలు రైళ్ల సేవలను రద్దు చేసినట్లు అధికారులు శనివారం ప్రకటించారు.

- 8లో



కోరుకొండలో మాల్యవంత్ ఉత్సవం

మల్కన్‌గిరి జిల్లాలోని కోరుకొండ సమితిలో సమితి స్థాయి మాల్యవంత్ ఉత్సవాలు శనివారం జరిగాయి.

- 8లో

న్యూస్‌రీల్

కాంగ్రెస్ గూటికి మాజీమంత్రి జయరాం



పంగిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్

జయపురం: కొరాపుట్ జిల్లా సీనియర్ రాజకీయ నేత, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జయరాం పంగి శనివారం కాంగ్రెస్ గూటికి చేరారు. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన కాంగ్రెస్ మిళన కార్యక్రమంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. పంగికి శరత్ పట్నాయక్ పుష్పగుచ్ఛం అందించి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు తొలసార మాజీ ఎమ్మెల్యే రంజిత్ బిడ్రియ, పలువురు బీజేడీ, బీజేపీ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా జయరాం పంగి మాట్లాడుతూ.. తన తండ్రిని గుర్తు చేసుకున్నారు. తాను తన తండ్రి సేవలందించిన పార్టీలో చేరానని ఆనందం వ్యక్తం చేశారు. తాను జీవించి ఉన్నంత వరకు ఆదివాసీ భూములు ఇతరుల హస్తగతం కాకుండా పోరాడుతానని స్పష్టం చేశారు.

ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక బజారు నియంత్రణ కమిటీ(ఆర్ఎంసీ) ఆధ్వర్యంలో శనివారం ప్రచార రథం ప్రారంభమైంది. సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్ర దేవి ముఖ్య అతిథిగా హాజరై రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పత్తి రైతుల సౌకర్యార్థం డిసెంబర్ 6వ తేదీ నుంచి జిల్లాల్లో మండీలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలియజేశారు. ఈ క్రమంలో రైతులకు అవగాహన కోసం ప్రచార రథాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. రైతులు సీసీఐ సంస్థ వద్ద తమ పత్తిని విక్రయించాలని సూచించారు. దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రచార రథం ద్వారా అవగాహన కల్పిస్తామని తెలియజేశారు.

నకిలీ మద్యం స్వాధీనం



సీజ్ చేసిన మద్యంతో ఎక్సైజ్ అధికారులు

బరంపురం: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నుంచి గంజాం జిల్లాకి బొలేరో వాహనంలో తరలిస్తున్న నకిలీ మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఐఐసీ అధికారి ఉదయ్ కుమార్ సంతోష్ తెలిపిన వివరాల మేరకు.. భువనేశ్వర్ నుంచి నకిలీ మద్యం అక్రమంగా రవాణా అవుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్ అధికారుల బృందం గోపాల్‌పూర్ జంక్షన్ మార్గంలో వాహన తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా అనుమానంతో ఒక బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా అందులో నకిలీ మద్యం బయటపడింది. దీంతో వాహనం, మద్యం సీజ్ చేయడంతో పాటు డ్రైవర్‌తో సహా మరో ముగ్గురిని అరెస్టు చేశారు. సీజ్ చేసిన మద్యం విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని అధికారులు తెలియజేశారు.

యువకుడి మృతదేహం లభ్యం



డొంబుమారిఖి మృతదేహం

రాయగడ: జిల్లాలో కాసీపూర్ సమితి టికిరి పోలీసుస్టేషన్ పరిధి దుడుకాబహాల్ గ్రామానికి సమీపంలోని ఒక పంట పొలంలో యువకుడి మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. మృతుడు కాసీపూర్‌లోని బొంధావీధికి చెందిన డొంబుమరిఖి(32)గా గుర్తించారు. శుక్రవారం సాయంత్రం కొంతమంది పొలం వైపుగా వెళ్లగా అక్కడ మృతదేహం పడి ఉండడం చూసి టికిరి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఐఐసీ విశ్వబొదిని బాగ్, ఏఎస్ఐ మనోజ్ జెన్నలు సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిక్కెట్టు రేసు.. ఎవరికి దక్కేనో చాన్సు..!

- రాయగడ బీజేడీలో రాజకీయ రగడ
- టిక్కెట్టు రేసులో పలువురు నాయకులు
- బీజేడీకి అనుకూలంగా స్వతంత్ర ఎమ్మెల్యే ముదులి
- పెద్దల ఆశీర్వాదం కోసం ప్రయత్నాలు



లాల్‌బిహారీ హిమిరిక



అనసూయా మాఝి



గంగాధర్ పువ్వల



బీజేడీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తున్న ముదులి (ఫైల్)

రాయగడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు రాజకీయ పార్టీలు సమాయత్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాయగడలో మునుపెన్నడూ లేనట్టుగా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. జిల్లాలో బిస్సంకటక్, గుణుపూర్, రాయగడ శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న రాయగడ నియోజకవర్గంలో ఈసారి బీజేడీ టిక్కెట్టుపై ఎవరు పోటీ చేస్తారనే అంశం చర్చనీయాంశంగా మారింది. 2019లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన మకరంద ముదులి విజయాన్ని సాధించారు. అప్పటి నుంచి ఆయన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నారు. ఎంతో విశ్వాసంతో తనను గెలిపించిన ప్రజలకు మెరుగైన సేవలను అందించే విధంగా నిత్యం కృషిచేస్తున్న ముదులి, కొద్ది నెలలుగా అధికార బీజేడీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుండంతో ఆయన బీజేడీ తీర్థం పుచ్చుకున్నారా..? లేక రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ టిక్కెట్టు ఆశిస్తున్నారో తెలియక రాజకీయవర్గాల్లో పలు చర్చలు జోరందుకుంటున్నాయి.

పోటీ రసవత్తరం

ఈసారి జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీజేడీ తరుపున పలువురు రేసులో ఉండడంతో రసవత్తరంగా మారింది. స్వతంత్ర అభ్యర్థి మకరంద ముదులితో పాటు మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు లాల్‌బిహారి హిమిరిక, స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ అనసూయా మాఝి, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర పువ్వల టిక్కెట్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. మాజీ మంత్రి లాల్‌బిహరి హిమిరిక ఈ నియోజకవర్గం నుంచి 2009, 2014లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. అనంతరం ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రిగా, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా కూడా ఆయన తన సేవలను అందించారు. ఈ నేపథ్యంలో మరోసారి పార్టీ టిక్కెట్టు కోసం హిమిరిక తన ప్రయత్నాలు చేస్తున్నారు. అదేవిధంగా ఇటీవల కాలంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న గంగాధర పువ్వల, అదేవిధంగా అనసూయా మాఝిలు కూడా టిక్కెట్ కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీ టిక్కెట్టు కోసం ప్రయత్నించి భంగపడిన అనసూయా మాఝికి ఈసారి టిక్కెట్టు లభించేందుకు అనుకూల పవనాలు వీస్తున్నట్లు సమాచారం. అయితే రాయగడ నియోజకవర్గం నుంచి పార్టీ టిక్కెట్టు లభించాలంటే అందుకు నెక్కంటి భాస్కరరావు అండదండలు పుష్కలంగా ఉండాలని రాజకీయ పరిశీలకుల అంచనా. దీంతో మాజీ మంత్రి లాల్ బిహరి హిమిరికతో ఆయనకు సత్సంబంధాలు ఎక్కువగా ఉండడంతో మారోసారి ఆయనకు టికెట్టు లభించే అవకాశం ఉన్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు. కాగా అనసూయ మాఝికి రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక, బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్‌ల ఆశీర్వాదం ఉండడంతో ఆమెకు సైతం అవకాశాలు లేకపోలేదు. అదేవిధంగా జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర్ పువ్వల కూడా తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ ఈ నియోజకవర్గం నుంచి బీజేడీ తరుపున పోటీ చేయాలంటే నెక్కంటి ఆశీర్వాదం పుష్కలంగా ఉండాల్సి ఉండడంతో ఆయనతో అందరూ కలిసిమెసి తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో పరిణామాలు ఎలా ఉంటామో వేచి చూడాల్సి ఉంది.

అంతర్గత విభేదాలే కారణం

గత ఎన్నికల్లో అధికార బీజేడీ పరాజయం పాలవ్వడానికి ఆ పార్టీలోని అంతర్గత విభేదాలే కారణమని స్పష్టమైంది. రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ రాష్ట్ర శాఖ ప్రస్తుత ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, కాసీపూర్‌లోని బీజేడీ సీనియర్ నాయకుడు కృష్ణ మహాపాత్రోల మధ్య ఏర్పడిన అంతర్గత విభేదాలే పార్టీ ఓటమికి కారణమయ్యాయని సమాచారం. దీంతో గతసారి చేసిన తప్పులను పునరావృత్తం చేయకుండా ఈసారి అంతా కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని అధిష్టానం ఆదేశాలు ఇవ్వడంతో ఆ దిశగా నాయకులు పని చేస్తున్నారు. అయితే రాయగడ శాసనసభ నుంచి బీజేడీ తరుపున పోటీ చేసేందుకు ఈసారి ఎవరికి అవకాశం లభిస్తుందోనని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

టికెట్ లభించకపోవడంతో...

2019 ఎన్నికల్లో రాయగడ నుంచి అధికార బీజేడీ తరుపున పోటీ చేసేందుకు ముదులి విశ్వ ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆయనకు టిక్కెట్టు లభించకపోవడంతో గత్యంతరం లేక స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. రాయగడ శాసనసభ నియోజకవర్గంలో అంతర్భాగమైన కాసీపూర్‌లో ఆయనకు బీజేడీకి చెందిన కృష్ణ మహాపాత్రో అండదండలు పుష్కలంగా ఉండడంతో విజయం సునాయాసమయ్యింది. అప్పట్లో ఆయన ప్రత్యర్థిగా పోటీ చేసిన అధికారి బీజేడీ పార్టీకి చెందిన లాల్ బిహారి హిమిరికపై 4,870 ఓట్ల మెజారీతో ముదులి విజయం సాధించారు. నియోజకవర్గంలోని 2,13,044 ఓట్లలో ముదులి 52,844 ఓట్లు సాధించుకోగా, లాల్బిహారి హిమిరికకు అనుకూలంగా 47,974 ఓట్లు వచ్చాయి. అదేవిధంగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అప్పలస్వామి కద్రకకు 39,657, బీజేపీ నుంచి పోటీ చేసిన బసంత ఉలకకు 24,425 ఓట్లు మాత్రమే వచ్చాయి.

ఘోరం..!

- తాగిన మైకంలో కన్నబిడ్డ, మరో వృద్ధురాలి హత్య
- అనంతరం అపస్మారక స్థితిలోకి నిందితుడు
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి



హత్యకు గురైన వృద్ధురాలు



దర్యాప్తు జరుపుతున్న పోలీసులు



చిన్నారి మృతదేహంతో విలపిస్తున్న బంధువు



రాధాశాంతను కట్టిపడేసిన గ్రామస్తులు

జయపురం: తాగిన మైకం, చెప్పుడు మాటలతో మనిషిననే విషయాన్ని మరిచి రెండు హత్యలు చేసిన నిందితుడు తాను కూడా చికిత్స పొందుతూ మరణించిన ఘటన నవరంగపూర్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నవరంగపూర్ జిల్లా పపడహండి పంచాయతీ గుజుమాపాదర్ గ్రామానికి చెందిన రాధా శాంత అనే వ్యక్తి శుక్రవారం తాగిన మైకంలో ఎవరో చెప్పిన మాటలు విని భార్య మాలతి శాంతను కత్తితో పొడవడానికి ఇంట్లో ప్రయత్నించాడు. భయపడిన ఆమె తన రెండేళ్ల బిడ్డ బొబి శాంతను ఇంట్లో ఉంచి, భయంతో బయటకు పరుగు తీసింది. దీంతో కోపంతో పిచ్చిపట్టినట్లు ప్రవర్తించిన రాధాశాంత తన రెండేళ్ల కుమారుడిని కత్తితో పొడిచాడు. ఆ చిన్నారి ఘటనా స్థలంలోనే మరణించాడు. ఇది చూసిన పక్కింటి వృద్ధురాలు జనాయి శాంత చిన్నారిని రక్షించడానికి వెళ్లగా, ఆమెపై సైతం కత్తితో దాడిచేశాడు. దీంతో వృద్ధురాలు సైతం ఘటన స్థలంలోనే మరణించింది. ఈ విషయం తెలియడంతో గ్రామస్తులంతా అక్కడికి చేరుకొని హత్యలు చేసిన వ్యక్తిని పట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు వచ్చి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే అప్పటికే తాగి ఉన్న అతడి ఆరోగ్యస్థితి సరిగా లేకపోవడంతో ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ రాధాశాంత మృతి చెందినట్లు సమాచారం. నవరంగపూర్ నుంచి వచ్చిన క్లూస్ టీమ్ హత్యకు సంబంధించిన ఆధారాలు సేకరించి, మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య



ట్రాక్‌పై యువకుడి మృతదేహం



పోలీసులు స్వాధీనం చేసుకున్న యువకుడి బైక్

బరంపురం: స్థానిక రైల్వేస్టేషన్‌కు సమీపంలోని ఆటోనగర్ రైల్వే లైన్‌పై గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం ఉదయం ఆటోనగర్ రైల్వేలైన్‌పై గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని స్థానికులు చూసి వెంటనే బరంపురం జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రైలు ఢీకొనడంతో యువకుని శరీరం గుర్తు పట్టలేని విధంగా మారింది. కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని, దర్యాప్తులో పూర్తి వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఎంకేసీజీ మెడికల్‌కి తరలించారు. మృతదేహం పక్కనే తనతో తీసుకొచ్చిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

సొనపూర్ అందాలు చూద్దాం రారండి..!



ఆకర్షణీయంగా ఉన్న కాటేజీలు

గంజాం జిల్లా ప్రకృతి అందాలు ఎవరి మనసునైనా ఇట్టే దోచేసుకుంటాయి. ప్రకృతి రమణీయత ప్రతీ మనసుని తట్టిలేపుతుంది. ఆలయాలు మదిని పునీతం చేస్తాయి. అలాంటి అంతర్జాతీయ పర్యాటక స్థలంగా గుర్తింపు పొందిన సొనపూర్ సాగర తీరంలో ఎకో–రిట్రీట్‌ను సీఎం నవీన్ పట్నాయక్ వర్చువల్ విధానంలో శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా, ఏడీఎం వినోద్ బెహర, బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్, గంజాం హోటల్స్ సంఘం అధ్యక్షుడు ఉమాకంత్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.


– బరంపురం



ఎకో రిట్రీట్ టూరిజం ప్రారంభిస్తున్న దృశ్యం



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, ఎంపీ శేఖర్ సాహు తదితరులు



పర్యాటకులను ఆకట్టుకుంటున్న బుద్ధుని సైకత శిల్పం



తీరంలో తీర్చిదిద్దిన రెస్టారెంట్

క్లుప్తంగా

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు రిఫరీగా సూరిబాబు



శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు రిఫరీగా జిల్లాకు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సంపతిరావు సూరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అంకమ్మ చౌదరి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. సూరిబాబు జెడ్పీహెచ్‌స్కూల్ చిలకపాలెంలో పీడీ(ఎస్‌ఏ-పీఈ)గా పనిచేస్తున్నారు. అస్సాం రాష్ట్రంలోని గౌహతి వేదికగా బీడబ్ల్యూఎఫ్ సూపర్-100 అంతర్జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2023 పోటీలు ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీల కోసం ఆయన ఆదివారం ఇక్కడ నుంచి పయనం కానున్నారు.

బీసీ కార్పొరేషన్ సూపరింటెండెంట్‌పై వేటు

శ్రీకాకుళం: బీసీ సంక్షేమ శాఖలో సూపరింటెండెంట్‌గా 2014లో శ్రీకాకుళంలో పనిచేసిన జీపీఎస్‌ఎన్ మూర్తిని విధుల నుంచి డిస్మిస్ చేశారు. ఆయనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసిన అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం ఈ చర్యలు తీసుకున్నారు. 2014లో ఆయన తన ఉద్యోగాన్ని అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడ్డారని పలువురు ఉద్యోగులు, సిబ్బంది లోకాయుక్తను ఆశ్రయించారు. స్పందించిన లోకాయుక్త అప్పటి ఐటీడీఏ పీఓ ఎల్ శివశంకర్‌ను విచారణ అధికారిగా నియమించింది. రంగంలోకి దిగిన శివశంకర్ సమగ్ర విచారణ చేసి నివేదికను లోకాయుక్తకు సమర్పించారు. 23 ఆరోపణలపై లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తే విచారణ నివేదికల్లో 18 ఆరోపణలు వాస్తవాలుగా తేలాయి. దీంతో ప్రభుత్వం ఆయన్ని విధుల నుంచి డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. మూర్తి ప్రస్తుతం అనకాపల్లి బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు.

చోరీకి పాల్పడిన యువకుడు అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్: నాలుగు చోట్ల 50 గ్రాముల బంగారం చోరీ చేసిన యువకుడు నగరంలోని భైరివానిపేట కూడలి సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు.. రూరల్ మండలం కర జాడ గ్రామానికి చెందిన బలగ హరిబాబు ఈ ఏడాది ఫిబ్రవరి, అక్టోబరు నెలల్లో నగరంలోని నాయుడుచెరువుగట్టు సమీప నివాసం, పీఎన్ కాలనీలో ఓ నివాసంలో దొంగతనానికి పాల్పడ్డాడు. ఇదే గాక రణస్థలం మండలం జేఆర్ పురం పరిధిలో 30 గ్రాముల బంగారం, రాజాంలో ఓ పల్సర్ బైక్ దొంగిలించాడు. పోలీసులు అతని నుంచి మొత్తంగా 26 గ్రాముల బంగారం, బైక్‌ను స్వాధీనం చేసుకుని హరిబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

'ఖైదీలకు సదుపాయాలు కల్పించాలి'

గార: ఖైదీలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలు కల్పించాలని, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన శనివారం అంపోలు జిల్లా జైలును సందర్శించారు. జైలులోని ఖైదీలతో వ్యక్తిగతంగా మాట్లాడారు. వంటశాలలో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సరుకులు నిల్వ చేసే గోడౌన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నబీఖాన్, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు, జైలర్ ఉదయబాస్కర్, డిప్యూటీ జైలర్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

సెమిస్టర్ పరీక్షల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న పోస్టు గ్రాడ్యుయేషన్ మూడో సెమిస్టర్ పరీక్షలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు శనివారం పరిశీలించారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. వర్సిటీలో ప్రారంభించిన నాలుగేళ్ల సమీకృత డిగ్రీ క్లాస్ వర్క్‌ను కూడా వీసీ శనివారం పరిశీలించారు.

జాప్యం లేకుండా పరీక్ష ఫలితాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో జాప్యం లేకుండా పరీక్ష ఫలితాల విడుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ పాలక మండలి కార్యాలయంలో ప్రతి నెల మొదటి శనివారం నిర్వహించే డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య నిర్వహించారు. ఈ ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమానికి పలు ఫోన్ కాల్స్ వచ్చాయి. డిగ్రీ రెండో సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాల్లో జాప్యంపై విద్యా ర్థులు ప్రశ్నించగా, వారం రోజుల్లో ఫలితాలు వెల్లడించి, జ్ఞానభూమి పోర్టల్‌లో ఉంచనున్నట్లు వీసీ చెప్పారు. ఒరిజనల్ డిగ్రీ ధ్రువీకరణ పత్రాలు అందజేయటంలో జాప్యంపై ప్రశించగా, భవిష్యత్‌లో కాల వ్యవధి నిర్ణయించి జారీకి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 2018 స్పెషల్ డీఎడ్ విద్యార్థి ఉపకార వేతనం సమస్య ప్రస్తావించగా, పరిశీలిస్తామని అన్నారు. పీజీ కోర్సుల్లో స్పాట్ వాల్యుయేషన్‌పై కొందరు ప్రశ్నించగా, ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రవేశాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో రిజస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ సీహెచ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

కోరుకొండలో మాల్యవంత్ ఉత్సవం



గుర్రపు పందేల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితిలో సమితి స్థాయి మాల్యవంత్ ఉత్సవాలు శనివారం జరిగాయి. దీనిలో భాగంగా ముందుగా మహిళలంతా కలిసి పవిత్ర నదీ జలాలను కలశాలతో తీసుకొచ్చారు. అనంతరం ఉత్సవాలను చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన గిరిజన సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈనెల 15వ తేదీ నుంచి జిల్లాస్థాయి ఉత్సవాలు జరుగుతాయి.

మల్కన్‌గిరిలో...

జిల్లాలో చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాలోని బాలికల పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ఉదయం మాల్యవంత్ ఉత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా పెప్పరమేట్ల పంచాయతీలో విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు, అధికారులు



కలశాలతో నదీ జలాలు తీసుకొస్తున్న మహిళలు

ముగిసిన యంత్ర మేళా



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ అజయ్ కుమార్ దాస్



మేళాకు విచ్చేసిన మిషన్ శక్తి మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్





వ్యవసాయ యంత్ర మేళాలో కొనుగోళ్ల సందడి

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వ్యవసాయ యంత్రాల మేళా శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయ పనిముట్లు, యంత్రాల మేళాలో రైతులు పేర్లు నమోదు చేసుకొని సబ్సిడీలు పొందాలని సూచించారు. అనంతరం పలువురు రైతులు, స్టాల్స్ నిర్మాణంలో సహకరించిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. చివరి రోజు అనేక మంది రైతులు, మహిళలు విచ్చేయడంతో మేళా కళకళలాడింది. కార్యక్రమంలో ఒడిశా అగ్రికల్చర్ టెక్నాలజీ వర్సిటీ ఫార్మ్ మెషిన్ టెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ అజయ్ కుమార్ దాస్, స్కీమ్ ఆఫీసర్ సంఘమిత్ర ప్రధాన్, సీడీఏవో బలరాం సుబుద్ధి, జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి ఇరేనియస్ ప్రధాన్, గుసాని వ్యవసాయ అధికారి శిశిర్ కుమార్ బిశోయి, జిల్లా కృషి అధికారి ఎ.రాంప్రసార్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సెలవులు రద్దు

భువనేశ్వర్: బంగాళాఖాతంలో తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వ్యవసాయ అధికారుల సెలవులు రద్దు చేసినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దక్షిణ ఒడిశాలోని ఐదు జిల్లాల్లో డిసెంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు వ్యవసాయ క్షేత్ర అధికారులందరి సెలవులను రాష్ట్ర ప్రభుత్వం శనివారం రద్దు చేసింది. మల్కన్‌గిరి, కొరాపుట్, రాయగడ, గజపతి, గంజాం క్షేత్రస్థాయి అధికారులందరికీ సెలవులు రద్దు చేయబడ్డాయి. వ్యవసాయ అధికారులంతా ఆదివారం సైతం విధుల్లో ఉంటారు. అంతటా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ పేర్కొంది. ఈ మేరకు ఐదు జిల్లాల ప్రధాన జిల్లా వ్యవసాయ అధికారి, ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్లకు లేఖ రాసింది. రైతులకు అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయి అధికారులందరినీ ఆదేశించారు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఈ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. పొలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంటల పరిరక్షణపై అనుబంధ రైతాంగాన్ని అప్రమత్తపరచడంపై అధికారులు అనుక్షణం సంసిద్ధంగా ఉండాలన్నారు.

కొనసాగుతున్న క్రీడోత్సవాలు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



బాలికలను పరిచయం చేసుకుంటున్న అనసూయ మాఝి



మీడియా ప్రతినిధుల క్రికెట్ బృందం

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి ప్రారంభమైన గిరిజన క్రీడోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆదివాసీ, హరిజన విద్యార్థులు వాలీబాల్, క్రికెట్, ఖోఖో పోటీల్లో సత్తాచాటుతున్నారు. ఆసక్తికరంగా జరుగుతున్న పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో స్థానికులు హాజరవుతున్నారు. ఆదివారంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఆర్డీసీ ఆకస్మిక పర్యటన



జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీసీ

పర్లాకిమిడి: దక్షిణ మండల రెవెన్యూ డివిజనల్ కమిషనర్ టి.ఆవ్ పర్లాకిమిడిలో ఆకస్మికంగా శనివారం పర్యటించారు. సర్క్యూట్ హౌస్‌లో కలెక్టర్, ఎన్నికల అధికారి స్మృతిరంజన్ ప్రధాన్, ఇతర రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్, సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడారు. అనంతరం ఈవీఎం గోడౌన్లు పరిశీలించారు. ఓటర్ల జాబితా సవరింపు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మాట్లాడినట్లు సమాచారం. సమావేశంలో బీజేడీ, బీజేపీ పార్టీ పట్టణ అధ్యక్షులు కుమార్, ఏడీఎం రాజేంద్ర మింజ్ తదితరులు హాజరయ్యారు.



అంతర్జాతీయ పోటీల్లో హరికృష్ణ ప్రతిభ

అంతర్జాతీయ సైకత-శిల్ప కళా ఉత్సవాల్లో గేదెల హరికృష్ణ రూపొందించిన సైకత శిల్పం

ఆమదాలవలస రూరల్: ఒడిశా రాష్ట్రం పూరీలో జరుగుతున్న అంతర్జాతీయ సైకత శిల్ప కళా ఉత్సవాల్లో తన శిల్పం ఉత్తమ శిల్పంగా ఎంపికైందని సైకత శిల్పి గేదెల హరికృష్ణ శనివారం తెలియజేశారు. పర్యావరణాన్ని ఎలా పరిరక్షించాలో, వాటి వల్ల మానవునికి కలిగే లాభాల గురించి, అడవులు, జంతువులను సంరక్షించడం వలన కలిగే లాభాల గురించి సైకత శిల్పం రూపంలో వివరించగా ఈ శిల్పాన్ని సెలెక్ట్ కమిటీ ఎంపిక చేసినట్లు తెలియజేశారు.

సుశాంత్ కుమార్ సస్పెన్షన్



శతపతి

జయపురం: ఇటీవల విజిలెన్స్‌కు పట్టుబడిన బొయిపరిగుడ పోలీసు అధికారి సుశాంత కుమార్ శతపతిని శనివారం సస్పెండ్ చేశారు. అవినీతి ఆరోపణపై అరెస్టు చేయబడిన శతపతి వద్ద రూ.37 లక్షలకు పైగా నగదు పట్టుబడిన విషయం తెలిసిందే. దీంతో ఆర్టికల్ 311(2)(బి) ప్రకారం సస్పెండ్ చేసినట్లు సమాచారం.

అక్రమ మద్యం దుకాణాలపై దాడులు



దుకాణాలను తొలగిస్తున్న పోలీసులు

రాయగడ: పట్టణంలో అక్రమంగా విదేశీ మద్యం, గంజాయి వ్యాపారాలు సాగుతున్నాయనే ఆరోపణలపై పోలీసులు ఆకస్మిక దాడులు శనివారం నిర్వహించారు. స్థానిక ఎస్డీపీవో కార్యాలయం ఎదుటనున్న గజపతి కూడలి వద్ద ఫుట్‌పాత్‌పై నివాసాలు, దుకాణాలు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకుని, అక్రమంగా విదేశీ మద్యం, గంజాయి వంటివి విక్రయిస్తున్నట్లు ఆరోపణలతో పోలీసులు దాడులు నిర్వహించారు. రాత్రి సమయంలో దుకాణాల్లో ఇటువంటి కార్యకాలాపాలు కొనసాగుతున్న నేపథ్యంలో శాశ్వతంగా తొలగించేందుకు పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఇకపై ఇటువంటి అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తుఫాన్ దృష్ట్యా పలు రైళ్లు రద్దు



భువనేశ్వర్: మైచౌంగ్ తుఫాన్ దృష్ట్యా తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధి నుంచి బయల్దేరుతున్న రైళ్లతో పాటు ఈ మార్గం గుండా రాకపోకలు చేసే పలు ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలను రద్దు చేసినట్లు అధికారులు శనివారం ప్రకటించారు. ప్రయాణికుల భద్రత కోసం రైల్వేశాఖ ఈ మేరకు నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తూర్పు కోస్తా రైల్వే గుండా రవాణా అయ్యే 54 ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలను రద్దు చేశారు. ఈ జాబితాలో తూర్పు కోస్తా రైల్వే నుంచి ఆరంభమయ్యే 12 రైళ్లు, ఈ జోన్ గుండా రవాణా అయ్యే 42 రైళ్లు, పూరీ నుంచి బయల్దేరే చెన్నై ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ నుంచి బయల్దేరే తిరుపతి, బెంగుళూరు ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం నుంచి బయల్దేరే చెన్నై, తిరుపతి, కడప ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

రద్దయిన ప్రధాన రైళ్లు

రైలు నంబర్	రైలు పేరు	రద్దు చేయబడిన తేదీ
12245	హౌరా-ఎస్ఎంవీబీ ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 3
12246	ఎస్ఎంవీబీ-హౌరా ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 5
12839	హౌరా-చెన్నై మెయిల్	డిసెంబర్ 2, 3, 4
12840	చెన్నై-హౌరా మెయిల్	డిసెంబర్ 4, 5, 6
12841	షాలిమార్-చెన్నై కోరమండల్ ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 3, 4, 5
12842	చెన్నై-షాలిమార్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 4, 5, 6
12845	భువనేశ్వర్-ఎస్ఎంవీబీ ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 3
12846	ఎస్ఎంవీబీ-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 4
17488	విశాఖపట్నం-కడప తిరుమల ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 3, 4, 5
17487	కడప-విశాఖపట్నం తిరుమల ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 4, 5, 6
22604	విల్లుపురం-ఖరగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 5
22603	ఖరగ్‌పూర్-విల్లుపురం ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 7
22708	తిరుపతి-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 3
22707	విశాఖపట్నం-తిరుపతి ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 4
22855	సంత్రాగచ్చి-తిరుపతి ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 3
22856	తిరుపతి-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 4
22859	పూరీ-చెన్నై ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 3
22860	చెన్నై-పూరీ ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 4
22869	విశాఖపట్నం-చెన్నై ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 4
22870	చెన్నై-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 5
22871	భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 3
22872	తిరుపతి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్	డిసెంబర్ 4

క్లుప్తంగా

మరో సైబర్ మోసం

• రూ.17.50 లక్షలు దోచుకున్న వైనం

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామానికి చెందిన ఓ బాధితుడు రూ.17.50 లక్షలు కోల్పోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణమూర్తి శనివారం తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెలలో బాధితుడి సెల్‌కు అగంతుకుడు ఫోన్ చేసి విదేశీ టూర్ ప్లాన్ ఉందని చెప్పి పలు దఫాలుగా రూ.17.50 లక్షలు దోచుకున్నాడు. ఈ సమయంలో బాధితుడి ఆధార్‌కార్డు, ఫొటో తీసుకున్నారు. కొద్ది రోజుల తర్వాత టూర్ కోసం బాధితుడు ఆరా తీయగా.. అతని ఫొటోను మార్ఫింగ్ చేసి బెదిరించారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేశారు.

ధాన్యం కొనుగోలు పరిశీలన



ధాన్యం రకాలను పరిశీలిస్తున్న జేసీ గోవిందరావు

సీతానగరం: ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని జేసీ రోణంకి గోవిందరావు స్పష్టం చేశారు. మండలంలోని పెదభోగిలి రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతు కొల్ల శ్రీనివాసరావు కల్లాం నుంచే ధాన్యం కొనుగోలులో భాగంగా నాణ్యతను, తేమశాతాన్ని పరిశీలించారు. తుపాను దృష్ట్యా వరి చేనును భద్రపరుచుకోవాలని సూచించారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ చొరవతో పార్వతీపురం మన్యం జిల్లాలో ముందుగానే ధాన్యం కొనుగోలు ప్రారంభించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ రాబర్ట్‌పాల్, పౌరసరఫరాల అధికారి నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ సభ్యులు ఎం.బాబ్జీ, ఏఓ ఎస్.అవినాష్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు లక్కిడాం యువకుడు



శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న కుమార్

గంట్యాడ: జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన గొల్లు కుమార్ ఎంపికయ్యాడు. ఈ నెల 29 నుంచి జనవరి 8వ తేదీ వరకు అరుణాచల్‌ప్రదేశ్ ఈటానగర్‌లో జరగబోయే జాతీయస్థాయి సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు 73 కేజీల విభాగంలో ఆంధ్రా తరఫున తలపడనున్నాడు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపించి అర్హత సాధించినట్టు కుమార్ తెలిపాడు.

రేపటి నుంచి తుఫాన్ ప్రభావం

విజయనగరం అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావం జిల్లాలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ మధ్యలో ఉంటుందని జేసీ కె. మయూర్ అశోక్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరి కోతలు వాయిదా వేసుకోవాలని, నూర్పిడి చేసిన పంటను సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని సూచించారు. పత్తి పంట రెండో ఏరివేతకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో వెంటనే ఏరివేయాలన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి-26పై శనివారం సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ ఎస్.రవి తెలిపిన వివరాల ప్రకారం.. గొట్లాం గ్రామానికి చెందిన తాళ్లపూడి బుచ్చినాయుడు(55) సైకిల్‌పై గొట్లాం బైపాస్ రోడ్డు నుంచి ఇంటికి వస్తుండగా అక్కడకు సమీపంలోని గ్రాండ్‌ఫుడ్ కోర్టు దాబాకు దగ్గరలో పార్వతీపురం వైపు నుంచి విజయనగరం వైపు వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. తీవ్రగాయాలపాలైన ఆయన అక్కడిక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య లక్ష్మితో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గజపతినగరం: జాతీయ రహదారిపై గజపతినగరం అపోలో మెడికల్ షాపు సమీపంలో శనివారం ఆటో ఢీకొట్టడంతో వృద్ధుడు గాయపడ్డాడు. మెంటాడ మండలం కొంపంగి గ్రామానికి చెందిన దాడి అప్పలనాయుడు(65) రోడ్డు గుండా నడిచి వెళ్తుండగా ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను వైద్యసేవల కోసం 108 వాహనంలో విజయనగరం సర్వజన ఆస్పత్రికి పోలీసులు తరలించారు.

దివ్యాంగులకు ఉజ్వల భవిత

• దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం
• భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ, ఆరోగ్య పరిరక్షణ
• ఉచితంగా ఉపకరణాల పంపిణీ
• చదువు, ఉద్యోగాల్లో ప్రోత్సాహం
• డిజిటల్ విద్యాబోధనకు అనువుగా ట్యాబ్‌ల పంపిణీ
• నెలనెలా ఠంచన్‌గా పింఛన్ అందజేత
• నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



రామభద్రపురం భవిత కేంద్రం



ఫిజియో థెరపీ చేస్తున్న వైద్యురాలు

రామభద్రపురం: దివ్యాంగుల సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. వివిధ సంక్షేమ పథకాల కింద ఆర్థిక తోడ్పాటుతో పాటు ఊరూరా వైద్యశిబిరాలు నిర్వహించి అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందజేస్తోంది. ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రమాణాలతో కూడిన విద్యను బోధించేందుకు శాశ్వత ప్రాతిపదికన ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించింది. వారి 'భవిత'కు గట్టి పునాది వేస్తోంది. దివ్యాంగులకు నెలనెలా ఠంచన్‌గా పింఛన్‌తో పాటు వైద్యసేవలను ఉచితంగా అందిస్తోంది. జీవన భరోసా కల్పిస్తోంది. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం (డిసెంబర్-3) సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఓ సారి పరికిద్దాం.

వాహన సేవ

జిల్లాలో 23వేల మంది ప్రత్యేకవసరాలు గల పిల్లలు, పెద్దలు ఉన్నారు. వారిని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటోంది. ఇటీవల రూ.3.30 కోట్లు విలువ చేసే మోపెడ్స్, బ్యాటరీ వాహనాలు, చెవిటి మిషన్లు, మూడు చక్రాల వాహనాలు, చేతి కర్రలు వంటి పరికరాలను 2,300 మంది దివ్యాంగులకు సమకూర్చింది. ఇందులో రూ.లక్ష విలువ చేసే మోపెడ్‌లను సుమారు 70 మందికి అందజేయగా, 432 మందికి ఒక్కొక్కరికి రూ.42 వేలు విలువ చేసే బ్యాటరీ వాహనాలను అందజేసింది.

అన్నింటా ప్రోత్సాహం

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉజ్వల భవితను అందించేందుకు జిల్లాలో ఉన్న 27 భవిత కేంద్రాలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బలోపేతం చేసింది. అందులో ప్రస్తుతం చదువుతున్న 539 మంది దివ్యాంగ పిల్లలకు ప్రమాణాలతో కూడిన విద్యాబోధనకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించింది. భవిత కేంద్రాల్లో పిల్లల వైకల్యం నిర్ధారణ, పూర్వ ప్రాథమిక దశలో ఉన్న సమస్య గుర్తింపు, ఉచిత ఉపకరణాల పంపిణీ, ఇంటి వద్దనే విద్య, చిన్నపాటి శస్త్ర చికిత్సలకు సహకారం, పిల్లల పెంపకంపై తల్లిదండ్రులకు శిక్షణ ఇస్తోంది. ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీ, దృష్టిప్రేరణ విద్యాబోధన, బ్రెయిలీలిపి వంటి సేవలందిస్తూ వివిధ లోపాలతో జన్మించిన పిల్లల్లో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తోంది. భవిత కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్ అలవెన్సు, హోంబేస్డ్ అలవెన్స్, రీడర్ అలవెన్స్, చికిత్స, రవాణా భత్యాలను ఒక్కొక్కరికీ నెలకు రూ.300 చొప్పున సమకూర్చుతోంది. గార్ల్ స్టైఫండ్ కింద నెలకు రూ.200 చొప్పున అందజేస్తోంది.

డిజిటల్ బోధన

శారీరక వైకల్యంతో బాధపడుతూ తోటి పిల్లలతో సమానంగా చదువుకోలేక తల్లడిల్లే చిన్నారుల బంగారు భవిత కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చారు. ప్రత్యేక యాప్‌లతో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. జిల్లాలో 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 119 మంది వినికిడి, దృష్టిలోపంతో బాధపడే విద్యార్థులు, 54 మంది ఐఈఆర్టీలు, ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తున్న 36 మంది ప్రత్యేక ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబ్‌లు అందజేశారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న విద్యార్థులందరూ ట్యాబ్‌లు వినియోగించుకునేందుకు వీలుగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను పొందుపరిచారు.

ఆర్థిక తోడ్పాటు

దివ్యాంగులు వివిధ యూనిట్లు ఏర్పాటుకు రాయితీతో కూడిన రుణాలతో పాటు, నెలనెలా రూ.3000 చొప్పున ఠంచన్‌గా ప్రభుత్వం పింఛన్ అందిస్తోంది. దివ్యాంగుల ఆర్థిక ఎదుగుదలకు సహకరిస్తోంది.

ప్రత్యేక శ్రద్ధ



భవిత కేంద్రాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేకంగా భవిత కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు కావలసిన సౌకర్యాలను కల్పిస్తోంది. వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు, వీల్ చైర్‌లు, నాణ్యమైన పరికరాలు అందిస్తోంది. ప్రత్యేక యాప్‌తో కూడిన ట్యాబ్‌లు సైతం సమకూర్చుతోంది. దివ్యాంగులు ఎలాంటి దరఖాస్తు చేయకుండా ప్రభుత్వమే గుర్తించి, కావాల్సిన సదుపాయాలు కల్పిస్తుండడం సంతోషదాయకం.

– సిరికి సూర్యారావు, సహిత విద్యా కో ఆర్డినేటర్

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. జిల్లాలో చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వయంఉపాధి పొందుతూ ఆర్థికాభివృద్ధి చెందేందుకు రుణాలు ఇస్తోంది. జిల్లాలో సుమారు 83 మందికి రూ.2 కోట్ల రుణాలు ఇచ్చాం. ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు మంజూరు చేశాం. జిల్లాలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపయోగపడేలా డీడీఆర్సీ (డిస్ట్రిక్ట్, డిజేబుల్డ్, రియాబ్లిటేషన్ సెంటర్) ఏర్పాటు చేయనున్నాం. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

– జి.జగదీష్, ఏడీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ, విజయనగరం



రామభద్రపురంలో దివ్యాంగురాలు నారాయణమ్మకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ గౌరి



ప్రత్యేకఅవసరాల పిల్లలకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, ఎంఈఓ తిరుమల ప్రసాదరావు

మహిళల 'కన్యాశుల్కం'

• నాటకంలోని పాత్రలకు జీవంపోస్తున్న మహిళలు
• ప్రధాన పాత్రధారులంతా వయోవృద్ధులే..
• నేడు ఆనందగజపతి కళాక్షేత్రంలో ప్రదర్శన
• గురజాడ విశిష్ట పురస్కారం అందుకోనున్న సినీ గేయరచయిత చంద్రబోస్



గురజాడ కన్యాశుల్కం నాటకాన్ని రిహార్సల్స్ చేస్తున్న నటీమణులు

విజయనగరం టౌన్: స్త్రీ అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు, వెయ్యేళ్లుగా వస్తున్న సాహిత్య ఒరవడిని మార్చి మరో వెయ్యేళ్ల ముందు చూపుతో రచనలు చేసిన సంఘసంస్కర్త మహాకవి గురజాడ వెంకట అప్పారావు. ఆయన ప్రజలందరికీ అర్థమయ్యేలా వ్యవహారిక భాషలో కన్యాశుల్కం నాటకాన్ని రచించారు. నాటకంలో ప్రతి పాత్రకీ ఓ శైలి ఉంటుంది. ప్రతీ పదం ఓ ఆలోచనాత్మకం. ప్రతి అంశం ప్రజలను మేల్కొలిపేలా ఉంటుంది. మహాకవి రచించిన కన్యాశుల్కం నాటకాన్ని కొందరు మహిళలు ప్రదర్శిస్తూ.. అందులోని పాత్రలకు జీవం పోస్తున్నారు. ఈపు విజయకుమార్ దర్శకత్వంలో భోగరాజు సూర్యలక్ష్మి ఆర్గనైజర్‌గా, గిరీశం పాత్రలో చూపరులను ఆకట్టుకుంటున్నారు. వెంకటేశం పాత్రలో కుమారి వాకా దేదీప్య, అగ్నిహోత్రవధానులుగా కుమారి సామవేదుల గీతారాణి, కరటకశాస్త్రిగా ముళ్లపూడి సుభద్రాదేవి, బుచ్చమ్మగా కుమారి సామవేదుల సత్యలత, వెంకమ్మగా ఉదయగిరి నీలిమలు కలిసి కన్యాశుల్కం నాటకంలో సన్నివేశాలను రక్తికట్టిస్తున్నారు. గురజాడ 108వ వర్ధంతిని పురస్కరించుకుని ఆనందగజపతి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు సినీగేయ రచయిత, ఆస్కార్ అవార్డ్ గ్రహీత కె.ఎస్.చంద్రబోస్‌కు గురజాడ విశిష్ట పురస్కారాన్ని గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ప్రదానం చేయనున్నారు. సభా కార్యక్రమానికి ముందు మహిళలతో గురజాడ కన్యాశుల్కంలోని కొన్నిసన్నివేశాలను ప్రదర్శించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, పురస్కార ప్రదాతగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, గౌరవ అతిథులుగా మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, విశిష్ట అతిథులుగా మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, నవసాహితీ సంస్థ (చెన్నై) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.వి.సూర్యప్రకాశరావు హాజరుకానున్నారు.

● 'మిచాంగ్'కు ముందే..!



బొబ్బిలి మండలం అలజంగి ప్రాంతంలో నూర్పిడిచేసిన ధాన్యం బస్తాలను ఇళ్లకు తరలిస్తున్న రైతులు

మిచాంగ్ తుపాను ముంచుకొస్తోందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు అప్రమత్తమయ్యారు. ఇంటిల్లపాదీ శనివారం ఉదయం నుంచి పొద్దుపోయేవరకు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. కోసిన చేనును కుప్పలుగా చేర్చారు. నూర్పిడి చేసిన ధాన్యంను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు వ్యవసాయ సిబ్బంది సైతం పొలాలకు వెళ్లి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. పొలం పనుల్లో తమ వంతు సాయమందించారు. ఈ నెల 6వ తేదీ వరకు వరికోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు కలెక్టర్ సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారులు, ఉద్యోగుల సెలవులను సైతం రద్దు చేసినట్టు తెలిపారు.

– బొబ్బిలి/విజయనగరం అర్బన్

అండర్-19 క్రికెట్ పోటీలకు జిల్లా బాలుర జట్టు



విజయవాడలో క్రికెట్ పోటీలకు బయలుదేరిన జిల్లా అండర్-19 స్కూల్‌గేమ్స్ జట్టు

విజయనగరం: విద్యార్థి దశలో క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న అండర్-19 స్కూల్‌గేమ్స్ క్రికెట్ పోటీలకు జిల్లా బాలుర జట్టు శనివారం పయనమైంది. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు విజయవాడలో జరగనున్న పోటీల్లో జిల్లా నుంచి 14 మంది క్రీడాకారుల బృందం ప్రాతినిధ్యం వహించనుంది. క్రీడాకారులను అండర్-19 స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ అభినందించి పలు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో పలువురు పీడీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు జిల్లా ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించనున్నట్టు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి డి.వి.చారిప్రసాద్ శనివారం తెలిపారు. నగరంలోని విజ్జీ స్టేడియం ప్రాంగణంలో నిర్వహించే సబ్ జూనియర్స్, కేడిట్ విభాగాల్లో ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఎంపిక పోటీల్లో క్రీడాకారుల గుర్తింపు కార్డు, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలన్నారు. ఆ రోజు జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనాలని కోరారు.

రసాయనిక పరిశ్రమల్లో..

ముందస్తు భద్రతా చర్యలే ప్రధానం

• పరిశ్రమల్లో భద్రతా చర్యలపై నెలరోజుల్లోగా నివేదికలు అందజేయాలి
• రసాయనిక విపత్తుల నిర్వహణ కమిటీలో కలెక్టర్ ఆదేశం



హాజరైన వివిధ శాఖల జిల్లా అధికారులు, (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో ప్రమాదకర రసాయనాలను నిల్వచేసే పరిశ్రమల్లో విపత్తులు సంభవించకుండా ఆయా పరిశ్రమలు తగిన భద్రత చర్యలు చేపట్టాలని జిల్లా స్థాయి విపత్తుల నిర్వహణ కమిటీ చైర్మన్, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. దీనికి సంబంధించిన నివేదికలను నెలరోజుల్లో అందజేయాలని ఆదేశించారు. ప్రమాదకర రసాయనాలు నిల్వచేసే పరిశ్రమల వల్ల జరిగే ప్రమాదాల నివారణకు ఏర్పాటైన జిల్లా (క్రైసిస్ గ్రూప్) విపత్తుల నిర్వహణ కమిటీ తొలి సమావేశం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగింది. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన భద్రత చర్యలు, ప్రమాదాలు జరిగిన వెంటనే వివిధ ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలు చేపట్టాల్సిన సహాయక చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

ప్రమాదకర రసాయనాలను ట్యాంకర్ల ద్వారా రవాణా చేసేటపుడు తగిన భద్రత నియమాలు పాటించేలా రవాణాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రసాయనాలు తీసుకువెళ్లే ట్యాంకర్లు మార్గమధ్యంలో తమకు తోచిన ప్రదేశంలో నిలిపివేయకుండా వాటిని నిలిపిన ప్రదేశం ఆయా రసాయనాలకు సంబంధించిన సమాచారం సమీపంలోని పోలీస్, ఫైర్ తదితర శాఖల అధికారులకు తెలియజేసేలా స్పష్టమైన నిబంధనలు రూపొందించాలన్నారు. ఆయా వాహనాలకు ప్రమాదం జరిగినపుడు దానివల్ల ఆ సమీప ప్రాంతంలోని వారికి సమస్యలు లేకుండా చూసేందుకు హెచ్చరిక వ్యవస్థలు ఏర్పాటు చేయాలన్నారు. రసాయనిక పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగే సమయంలో వివిధ ప్రభుత్వ శాఖలు, ఆయా పరిశ్రమలు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై అవగాహన, సన్నద్ధత కోసం ఈ నెల 21న మాక్‌డ్రిల్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మైలాన్ పరిశ్రమలో భద్రతా ఏర్పాట్లను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ తెలిపారు. విశాఖలోని సివిల్ డిఫెన్స్ విభాగం ద్వారా ప్రజలకు ఈ అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు సివిల్ డిఫెన్స్ డిప్యూటీ కలెక్టర్ పద్మలత చెప్పారు. జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ వలంటీర్లకు ప్రథమ చికిత్స అందించడంలో శిక్షణ ఇచ్చి అత్యవసర సమయాల్లో సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఫ్యాక్టరీల్లో రసాయనాలతో పార్క్‌చేసిన ట్యాంకర్లను వెంటనే తరలించేందుకు వీలుగా అత్యవసర గేటును అదనంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో అత్యంత ప్రమాదకర రసాయనాలు నిల్వచేసే పరిశ్రమలు లేవని, ప్రమాదకర రసాయనాలు నిల్వచేసే ఫ్యాక్టరీలు పది వరకు ఉన్నట్టు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీఎస్ నారాయణ చెప్పారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు, జిల్లా ఫైర్ ఆఫీసర్ రాంప్రకాష్, విశాఖలోని జాయింట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, రవాణాశాఖ అధికారి రమేష్, ప్రకృతి విపత్తుల నివారణ సంస్థ డీపీఎం రాజేశ్వరి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ప్రసాదరావు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

424 కిలోల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట: ఎస్ఈబీ అధికారులు పక్కా సమాచారంతో దాడిచేసి రూ.50లక్షలు విలువ చేసే 424 కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్.కోట ఎస్ఈబీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్.వెంకటరావు గంజాయి కేసు వివరాలు వెల్లడించారు. కమిషనర్ ఎం.రవిప్రకాశ్, డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, ఎస్పీ మహేశ్వరరాజుకు అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఎస్.కోట వైపు భారీగా గంజాయి రవాణా అవుతున్నట్టు సమాచారం వచ్చింది. దీంతో సిబ్బందిని అప్రమత్తం చేశాం. శుక్రవారం రాత్రి రెండు వాహనాలతో డీటీఎఫ్, ఎస్.కోట ఎస్ఈబీ, సిబ్బందితో గస్తీ కాశాం. బొడ్డవర చెక్‌పోస్టులో పోలీసులు వాహనాన్ని ఆపే ప్రయత్నం చేసినా, డ్రైవర్ అతివేగంగా గంజాయి ఉన్న బొలేరో వాహనాన్ని తాటిపూడి రోడ్డులోకి మళ్లించాడు. రెండు వాహనాల్లో ఎస్ఈబీ, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బొలేరో వాహనాన్ని వెంబడించారు. అతివేగంతో వెళ్తున్న బొలేరో నవోదయ స్కూల్ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌ను , బొలేరో వాహనంలో ఉన్న గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ కొర్రా రమేష్ గంజాయిని వేపాడ మండలంలోని బొద్దాం గ్రామానికి తరలిస్తున్నట్టు చెప్పాడని, దీనిపై పూర్తిస్థాయి విచారణకు టాస్క్‌ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఎస్.కోట పోలీసులు సహకారం అందించారన్నారు.